

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

24 జూన్ 2025 పేజీలు : 08 మంగళవారం


తెలుగుదేశంలోకి

## మైనార్టీ కీలక నేతల చేరిక

**వైసీపీకి ఇస్మాయిల్ ఖాద్రి, కంతర్ అలీ గుడ్‌బాయ్**



నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :

నెల్లూరు రూరల్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు బారాషాహిద్ దర్గా ఫెస్టివల్ కమిటీ మాజీ చైర్మన్ ఇస్మాయిల్ ఖాద్రి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కంతర్ అలీ వైసీపీకి రాజీనామా చేసి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, గిరిధర్ రెడ్డి సమక్షంలో టీడీపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరో వారంరోజుల్లో వివిధ డివిజన్‌ల నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో భారీ చేరికలు ఉండబోతున్నాయన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 18 గ్రామాల సర్పంచ్‌లు, 12 ఎంపీటీసీలు, ఒక జెడ్‌పిటిసి, 26 డివిజన్ల కార్పొరేటర్లను వందకు వంద శాతం గెలుచుకొని తీరుతామన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టం చేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు.


ఎన్‌సీసీ కేడేట్లు.. లోపల పేజీలో

## సుశిక్షితులైన బాల సైనికులు




ప్రజలు సంతృప్తి చెందేలా.. 02

## అర్జీలను పరిష్కరించాలి




- భారీగా తరలివచ్చిన యువత
- నిరుద్యోగ సమస్యలపై వినూత్న రీతిలో రిక్షా తొక్కుతూ నిరసన
- 'వైసీపీ యువత' కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి






# విజయవంతం

నెల్లూరు, మేజర్‌న్యూస్ :

వైసీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన యువత పోరు కార్యక్రమానికి భారీగా నిరుద్యోగులు, యువత తరలి వచ్చారు. సోమవారం పాత జడ్పీ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు వైసీపీ శ్రేణులు, నిరుద్యోగ యువత భారీగా తరలివచ్చి జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. ముందుగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి జెండా ఊపి యువత పోరు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యువత సమస్యలపై వినూత్న రీతిలో రిక్షా తొక్కుతూ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఊటుకూరు నాగార్జున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం యువతకు చేస్తున్న అన్యాయాలను నినదీస్తూ యువత ప్లకార్డులు చేత పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. వైసీపీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి కిషన్ మాట్లాడుతూ.. నిరుద్యోగ భృతి పేరుతో చంద్రబాబు యువతను దగా చేశారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నప్పటికీ చంద్రబాబుచే తల్లికి వందనం అమలు చేయించిన ఘనత వైసీపీ యువజన విభాగానిదేనన్నారు. వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం మెడలు వంచి యువతకు నిరుద్యోగ భృతి కూడా యువతకు అందేవిధంగా వైసీపీ పోరాటం చేస్తుందని తెలిపారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు యువత పోరు కార్యక్రమాన్ని జిల్లాలో దిగ్విజయంగా నిర్వహించామన్నారు. చంద్రబాబు చేస్తున్న అన్యాయాలకు యువతతో పాటు విద్యార్థులు కూడా ఎంతో నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో చదువు పూర్తి చేసుకొన్న విద్యార్థులు కళాశాలల నుంచి సర్టిఫికెట్లు తీసుకోలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కార్పోరేటర్ ఊటుకూరు నాగార్జున మాట్లాడుతూ.. జిల్లాలో

మిగతా 2



## బాలికకు అండగా..
# ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

నెల్లూరు, మేజర్‌న్యూస్ :

ఇందుకూరుపేట మండలం కుడితిపాలెం కాకర్లదిబ్బలో జరిగిన ఘటనలో తీవ్రంగా గాయపడిన చెంచమ్మ అనే బాలికకు వేమిరెడ్డి దంపతులు అండగా నిలిచారు. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలిక వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బాలిక పరిస్థితిని తెలుసుకున్న వెంటనే.. స్థానిక నాయకులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో టీడీపీ నేతలు కోడూరు కమలాకర్ రెడ్డి, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పవన్ రెడ్డి, మైనార్టీ నాయకులు షేక్ ఇంతియాజ్ తదితరులు బాలికను ఇందుకూరుపేట ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అపోలో ఆసుపత్రికి తీసుకువచ్చి వైద్యసేవలు అందిస్తున్నారు. కుడితిపాలెం కాకర్లదిబ్బలో బాలికపై బంధువులు దారుణంగా దాడి చేసి వాతలు పెట్టగా.. ఈ ఘటనను ఎమ్మెల్యే ప్రశాంతమ్మ తీవ్రంగా పరిగణించారు. దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే బాలిక పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు. బాలికకు అన్ని విధాలా అండగా ఉంటామని ఆమె వెల్లడించారు.

# ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలి

## జాయింట్ కలెక్టర్ కార్తీక్ - ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 399 అర్జీలు



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీతో పాటు డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, సర్వే రికార్డుల ఏడీ నాగశేఖర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు.

### పేదల భూములను ఆక్రమించిన రిటైర్డు ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి :

నగరంలోని వేదాయపాలెం చంద్రమౌళి నగర్లో సర్వేనెంబరు 78/2లో గతంలో పేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూమిని రిటైర్డు ఉద్యోగి పోగుల విజయసేన్‌కుమార్ నకిలీ డాక్యుమెంట్లతో ఆక్రమించి బిల్డింగ్ నిర్మించి అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని, వెంటనే ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని చేకూరి సురేష్ అనే అర్జీదారుడు పీజీఆర్ఎస్‌లో అర్జీ అందించారు. అనేకసార్లు ఈ రిటైర్డు ఉద్యోగి ఆక్రమణలపై నెల్లూరు రూరల్ మండల తహసిల్దారు కార్యాలయ అధికారులకు ఫిర్యాదు చేసిననూ పట్టించుకోవడం లేదని, వెంటనే అధికారులు స్పందించి కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని అర్జీని అందించారు.

### విద్యాహక్కు చట్టం ద్వారా పాఠశాలలో సీటు ఇప్పించండి :

విద్యాహక్కుచట్టం ఆర్‌టిఈ యాక్ట్ ప్రకారం తమ కుమార్తె గోనుగుంట దేవిక 1వ తరగతిలో ఉచితంగా ప్రవేశం పొందేందుకు సెలెక్ట్ అయినట్లు, శ్రీ చైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో సంప్రదించాలని ఫోన్‌కు మెసెజ్ వచ్చిందని, అయితే ఆ పాఠశాల వారు తమ పాపను చేర్చుకోకుండా, ఫీజులు కట్టి చేరాలని ఇబ్బందులు పెడుతున్నారని పి.భవాని అనే మహిళ పిజిఆర్ఎస్‌లో అర్జీ అందజేసింది. ఈ విషయమై అధికారులు చ్కైతన్య పాఠశాల వారితో మాట్లాడి తమ పాపకు ఆర్‌టిఈ యాక్ట్ ప్రకారం అడ్మిషన్ ఇప్పించాలని ఆమె విన్నవించారు.

### ప్రరిష్కార వేదికకు 399 అర్జీలు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 399 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూశాఖకు సంబంధించి 142, మున్సిపల్‌శాఖకు సంబంధించి 39, సర్వేకు 44, పంచాయతీరాజ్‌శాఖకు 32, పోలీసుశాఖకు 39 అర్జీలు అందాయి. ఈ అర్జీలపై సానుకూలంగా స్పందించిన జాయింట్ కలెక్టర్ నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## విజయ డెయిరీ ఉద్యోగుల వయో పరిమతి పెంపు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు విజయ డెయిరీలో పని చేస్తున్న సిబ్బంది ఉద్యోగ వయో పరిమితిని 58 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలకు పెంచుతూ విజయ డెయిరీ పాలకమండలి ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. ఈ మేరకు సోమవారం వెంకటేశ్వరపురంలోని విజయ డెయిరీ కార్యాలయంలో డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి అధ్యక్షతన డెయిరీ పాలక మండలి సమావేశం జరిగింది. సమావేశంలో డెయిరీలో పని చేస్తున్న సిబ్బంది ఉద్యోగ వయో పరిమితిని 58 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వరకు పెంచుతూ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తీసుకున్న నిర్ణయానికి పాలక మండలి సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఉద్యోగ వయో పరిమితిని 60 సంవత్సరాల వరకు పెంచుతూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన డెయిరీ చైర్మన్, బోర్డు సభ్యులకు డెయిరీ సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి హర్షం వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్యే ప్రశాంతమ్మ చొరవతో పారిశుద్ధ్య చర్యలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి చొరవతో కొడవలూరు మండలం మానే గుంటపాడు ఎస్టీ కాలనీలో అధికారులు పారిశుధ్య చర్య లు చేపట్టారు. మానేగుంట పాడు ఎస్టీ కాలనీలో అపరిశుభ్రతతో ఇబ్బందులు ఎదు ర్కొంటున్నామని స్థానిక ప్రజ లు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ దృష్టికి తీసుకువెళ్లారు. వెంట నే స్పందించిన ఎంఎల్ఏ.. మండల ఎంపిడిఓ దృష్టికి తీసుకువెళ్లి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ఆదేశాలతో అధికారులు గ్రామానికి వెళ్లి కాలువల్లో పూడిక తీయించారు. పారిశుద్ధ్య చర్యలు తీసుకున్నారు. గ్రామాల్లో రోగాలు వ్యాప్తి చెందకుండా పకడ్బంది చర్యలు చేపట్టారు. త్వరలో కాలనీలో నూతన మురుగు కాలువలు ఏర్పాటు చేసే లా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ మేరకు అంచనాలు తయారు చేయిం చామని, త్వరలో కాలువల నిర్మాణం చేపడతామని వివరించారు.

## ఎన్‌సీసీ కేడేట్లు.. సుశిక్షతులైన బాల సైనికులు




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** 10వ ఆంధ్ర నేవెల్ యూనిట్ ఎన్‌సీసీ నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గౌదంగవే ఆధ్వర్యంలో 9వ ఎన్‌సీసీ నేవల్ వార్షిక శిక్షణా శిబిరం కోట మండలం విద్యానగర్‌లోని నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహిస్తున్నారు. క్యాంపు ప్రారంభమై ఇది నాలుగవ రోజు. ఈ సందర్భంగా క్యాంపు కమాండెంట్ గణేష్ గౌదంగవే మాట్లాడుతూ.. ఎన్‌సీసీలో చేరినందుకు మీరు ధన్యులని, భావి జీవితంలో దేశ సేవలో సైనికులుగా చేరితరించే అవకాశం మీకు లభిస్తుందని అందుకు మీరు గర్వపడాలని, క్రమశిక్షణ, సేవాభావం అలవరచుకోవాలని సుశిక్షితులైన బాల సైనికులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కేడేట్లకు శారీరక దారుఢ్యం, ఫైరింగ్ పేరేడ్ ట్రైనింగ్, డ్రిల్, వ్యక్తిత్వ వికాస అభివృద్ధి, సామాజిక అవగాహన, బోట్ వర్క్, నేవల్ ఓరియంటేషన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఆరోగ్యం పరిశుభ్రత, షిప్ మోడలింగ్, ఎన్‌సీసీ జనరల్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. సీనియర్ డివిజన్ సీనియర్ వింగ్ క్యాడెట్లకు ఇంటర్ గ్రూప్ కాంపిటేషన్ (ఐజిసి), నవ సైనిక్ క్యాంపులకు ఎంపికయ్యే విధంగా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కొంతమంది క్యాడెట్‌లను కృష్ణపట్నం పోర్టుకు క్షేత్ర పర్యటన నిమిత్తం సందర్శింపజేసి షిప్పులను ప్రత్యక్షంగా చూపించి వాటి గురించి క్యాడెట్లకు అవగాహన కల్పించారు. అంబులెన్సు, 108 అందించు సేవలు అంశంపై ఉపన్యాసం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. అనంతరం క్యాడెట్లకు గేమ్స్ అండ్ స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. క్యాడెట్లు అత్యంత ఆనందోత్సాహాలతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. శిక్షణా శిబిరంలో ఎన్‌సీసీ ఆఫీసర్లు, పీఐ స్టాఫ్ పాల్గొన్నారు.



# యువత పోరు విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు నెల్లూరు సిటీ వైసీపీ ఇన్చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సహకారంతో జిల్లాలో పెద్ద ఎత్తున యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. వైసీపీ ఇచ్చిన ఒక పిలుపుతో జిల్లా నలుమూలల నుంచి యువత ఉప్పెనలా యువత పోరు కార్యక్రమానికి తరలిరావడం జరిగిందన్నారు. కార్యక్రమాన్ని చూస్తుంటే.. కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతుందన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు యువత ను మభ్యపెట్టి ఓట్లు వేయించుకొని ఈ రోజు వారికి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కాలం పూర్తవుతున్నప్పటికీ యువతకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా చంద్రబాబు అమలు చేయలేదన్నారు. అధికారంలోకి రాగానే యువతకు 3 వేల రూపాయల నిరుద్యోగ భృతి, ఏడాదికి 5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు ఈరోజు ఆ హామీలన్ని మరచి అధికారంలోకి రాగానే.. యువతను వెన్ను పోటు పొడిచారన్నారు. చంద్రబాబు నాయుడి జీవితం అబద్దాల పుట్ట అన్నా రు. ఇటీవల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చంద్రబాబు దుర్మార్గపు పాలనపై పుస్తకం విడుదల చేయడం జరిగిందని, అదే చంద్రబాబు జీవితంలో ఇప్పటివరకు చేసిన తప్పులను లెక్కిస్తూ పుస్తకాలను రచిస్తే.. 'అబద్ధాలు చంద్రన్న మోసాల బాబు' అని ఊరికో లైబ్రరీ పెట్టాల్సి వస్తుందన్నారు. 2 లక్షల 50 వేల మంది వాలంటీర్లకు అబద్ధపు హామీలు ఇచ్చి మోసం చేశారని, అలాగే ఏడాదికి ఐదు లక్షల ఉద్యోగాలు ఇస్తామని యువతను చంద్రబాబు మోసం చేశారని తెలిపారు. మరోపక్క రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతుంటే.. చంద్రబాబు జబర్దస్త్ స్కిట్లతో ఎంజాయ్ చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఆడబిడ్డలపై హత్యలు, మానభంగాలు పెచ్చు మీరిపోయాయని వాటిని నిలువరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మి నిలువునా మోసపోయామని ప్రజలు గ్రహిం చి మళ్ళీ ఈ రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పాలనను తెచ్చు కోవాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరి మార్చుకొని యువతకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేదంటే భవిష్యత్తులో వైసీపీ మరింత ఉధృతంగా పోరుబాట సాగిస్తుందని హెచ్చరించారు.

కార్యక్రమంలో వైసీపీ మహిళా అధ్యక్షురాలు సునంద, సిటీ వైసీపీ అధ్యక్షుడు బొబ్బల శ్రీనివాస యాదవ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

# జలదంకిలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు

**జలదంకి, మేజర్‌న్యూస్ :** భారతీయ జనసంఘ వ్యవస్థాపకులు శ్రీ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 'ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు' వ్యతిరేకించి కాశ్మీర్‌కి ప్రత్యేకమైన రాజ్యాంగాన్ని, స్వయం ప్రతిపత్తిని ఇస్తున్న నెహ్రూ గారి విధానాల్ని దుయ్యబడుతూ ఆరోజు మంత్రి పదవికి రాజీనామా చేసి భారతీయ జనసంఘ ఏర్పాటు చేశారు. 1951-52 మొదటి లోక్ సభ ఎలక్షన్స్‌లో 3 సీట్లు వచ్చినప్పటికీ జాతీయవాదం కలిగినటువంటి 'హిందూ మహాసభ 'అఖిల భారతీయ రామ రాజ్య పరిషత్'. 'ఆల్ ఇండియా గణతంత్ర పరిషత్' మొదలైన వాటితో 32 ఎంపీ స్థానాలతో జాతీయ కూటమిని ఏర్పాటు చేయడం జరిగింది. పాకిస్తాన్ మొదటి ప్రధాని లియాకత్ ఖాన్- నెహ్రూ ఒప్పందాలతో విసిగి వేసారిన శాంప్రసాద్ ముఖర్జీ 1953లో 'ఒక దేశం ఓకే రాజ్యాంగం' అన్న నినాదంతో కశ్మీరీ పర్యటనని ప్రారంభించారు. ఆయన్ని జైల్లో నిర్బంధించి ఆయన మరణాన్ని ఒక గుండెపోటు చిత్రీకరించారు. ఆ రోజుటి నుంచి ఈరోజు వరకు శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా భారతీయ జనసంఘ, భారతీయ జనతా పార్టీ అవిశ్రాంతంగా పోరాడి 2019లో 'జమ్ము- కాశ్మీర్ ఆర్గనైజేషన్ యాక్ట్2019 'ద్వారా కాశ్మీర్‌కి ఉన్న స్వయం ప్రతిపత్తిని రాజ్యాంగాన్ని తొలగించి నరేంద్ర మోడీ ప్రభుత్వం శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్బంగా వారి నివాళులర్పించడం జరిగిందన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. వారు చేసిన త్యాగాన్ని గుర్తుంచుకొని రోజు జాతీయ పార్టీ, రాష్ట్ర పార్టీ అన్ని మండలాల్లో అన్ని బూత్ లెవెల్‌లో



శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన కార్యక్రమాన్ని జరగాలని నిశ్చయించింది. అనుగుణంగా భారతీయ జనతా పార్టీ జలదంకి మండల కార్యాలయంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం మండల అధ్యక్షులు ముడి కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి మండల ప్రధాన కార్యదర్శి రాకేష్ వంటేరు, యువ మోర్చా మండల అధ్యక్షులు ఆతిన చైతన్య, మండల బిజెపి కార్యదర్శి కమతం బాలకోటయ్య, ఎస్కే ఆదం సాహెబ్, ఎస్టి మోర్చా సభ్యులు పువ్వాడి వంశి, తదితరులు నివాళులర్పించారు.

# ఘనంగా సంయుక్త సేవా సంస్థ పదో వార్షికోత్సవం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని వై.నందన వీధిలో శ్రీనివాస కళ్యాణ మండపం నందు సంయుక్త సేవా సంస్థ పదో వార్షికోత్స వం, కోసం ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథులు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్రావు యాదవ్, బుల్లితెర సినీ నటులు వాసుదేవరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మొదటిగా నృత్యకళా నిలయం చిన్నారులు ఆనంద భరిత నృత్య కళా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. సంయుక్త సేవ సంస్థ 2015లో స్థాపించినప్పటి నుండి ఎన్నో కష్టాలు బాధలు వడి సురేంద్ర ఈ సంస్థను ఒక మంచి స్థితికి తెచ్చారని ఒక ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అభినందనీయమని తెలిపారు. వారి కుమార్తె కుమారి లిఖిత ఏర్పాటు చేసిన నృత్య కళా నిలయమునకు నివేశ స్థలం మంజూరు చేయుటకు నావంతు సహాయ సహ కారం త్వరితగతిన అందిస్తానని తెలిపారు. రాజ్య సభ సభ్యులు మేధా మస్తాన్రావు మాట్లాడుతూ.. సామాజిక సేవా తత్పరులు సురేంద్ర కుమార్తె నాట్య గురువు కుమారి లిఖిత అనారోగ్యంతో ఎన్నో కష్టాలు సమస్యల నుండి బయటపడి ఆరో గ్యంతో మన ముందు ఉందని శాసనసభ్యులు నివేశస్థలం మంజూరు చేస్తే, నృత్య కళానిలయం నకు ఎంపీ నిధుల నుండి నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. ముత్య కళానిలం చిన్నారులు ఆనందో భరితంగా నిరాటంకంగా నిర్వహించిన నృత్య కళ ప్రదర్శనకు 25వేల రూపాయల చెక్కును బీఎంఆర్ ట్రస్ట్ ద్వారా బహుమతిగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సురేంద్ర, లిఖిత మాట్లాడుతూ.. 2015వ సంవత్సరం నుండి ఎప్పటి వరకు సంయుక్త సేవా సంస్థ విజయవంతంగా నిర్వహిస్తున్న ది అంటే ఎందరో మహానుభావులు దాఖలు సహాయ, సహకారా లతో విజయవంతంగా కొనసాగిస్తుందని వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుం టున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# డాక్టరేట్ గ్రహీత అందే శ్రీనివాసులుకు ఆత్మీయ సత్కారం

**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** ఎస్వీఆర్ స్కూల్ అధినేత, గౌరవ డాక్టరేట్ గ్రహీత డాక్టర్ అందే శ్రీనివాసులునుసోమవారం అఖిల భారత పద్మశాలీ సంఘం నెల్లూరు జిల్లా కార్యవర్గ సభ్యు లు ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ యువసేన సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారంతో గౌరవించారు. ఇటీవల ఇంటర్నేషనల్ అచీవ్మెంట్ అవార్డ్స్, ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ, రియల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సంయుక్త ఆద్వర్యంలో అందే శ్రీనివాసులుకు గౌరవ డాక్టరేట్ను ప్రధానం చేసిన విషయం విదితమే. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక జాకీర్ హు స్సన్నగర్ నందు అందే శ్రీనివాసులును మర్యాదపూర్వ కంగా కలిసిన పద్మశాలీ సంఘం నెల్లూరు జిల్లా కార్యవర్గసభ్యులు, ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ యువ సేన నాయకులు శాలువా కప్పి ఘనంగా సత్క రించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ యువసేన రాష్ట్ర, జిల్లా అధికార ప్రతినిధులు మునగపాటి




రమేష్, మాగం వెంకటేశ్వర్లు, చేవూరు వెంకయ్య ఎస్వీఆర్ స్కూల్ ప్రిన్సిపాల్ బట్టురవెష్ బాబు, అఖిల భారత పద్మశాలీ సంఘం నెల్లూరు జిల్లా నాయకుడు సోమాగోపాల్, పద్మశాలీ సంఘం నెల్లూరు జిల్లా నాయకులు వింజమూరు వెంకటేశ్వర్లు చొప్పా మురళి, పాల అశోక్, జానపాటి విజయ్కుమార్, గండికోట రామ్మోహన్, పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసి యేషన్ వ్యవస్థాపక అద్యక్షుడు కె.మురళీ మోహన్రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈఓగా గోవిందయ్య బాధ్యతల స్వీకరణ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు ఎంఈఓ-1గా బి.గోవిందయ్య (ఎఫ్ఏసీ) బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్న బి.శ్రీధర్ పదవీ విరమణ చెందడంతో ఆ ఉద్యోగం ఖాళీ అయింది. నూతన ఎంఈఓ-1గా గోవిందయ్య ఎఫ్ఏసీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు అవ సరమైన సౌకర్యాలను సకాలంలో అందించగలరని ఎలాంటి జాప్యం లేకుండా ఉండేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 మధుసూదన్ రెడ్డి ఎంఐసి మౌనిక జలీల్ శ్రీహరిలు ఉన్నారు.

## ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జి వర్ధంతి వేడుకలు




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** హిందూత్వవాది, సంఘాశంస్కర్త శ్యాంప్రసాద్ ముఖర్జి బలిదాన్ వర్ధంతి వేడుకలు సోమవారం బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా జిల్లానాయ కులు బాలకృష్ణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ముఖర్జి కలకత్తాలో జన్మించారు ప్రముఖ న్యాయవాది సంఘ సంస్కర్త ఈ సువిశాల భారతదేశం అంతా పర్యటించి హిందుత్వవాద కోసం ఎంతో తపన చెందారు భారతీయ జన సంఘం స్థాపించారు. స్వతంత్రం వచ్చిన పండిట్ జవహర్లాల్ నెహ్రు ప్రభుత్వంలో పరిశ్రమల శాఖ మంత్రిగా పని చేసినారు వారి విధానాలను నచ్చక బయటకు వచ్చి కాశ్మీరు పర్యటనలో అరెస్టు అయి జైల్లోనే మరణించ్చారు. తన తుది శ్వాసవరకు హిందూ భావజాలంతో జీవించారు. ఈ కార్యక్రమంలో ఉద యగిరి బిజెపి మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి సీనియర్ నాయకులు నారాయణరెడ్డి మండల ఇన్‌చార్జ్ హరిగోపాల్ రెడ్డి, భూపాల కార్తీక్, శ్రీహరి శ్రీరాములు, సుబ్బారెడ్డి, చెన్నారెడ్డి, బాలమురళిలు పాల్గొన్నారు.

## దుకాణాల బకాయిలను వెంటనే వసూలు చేయాలి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన దుకా ణాల బకాయిలను వెంటనే వసూలు చేయాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి తెలిపారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డిఓ కార్యాలయం పరిపాలన అధికారి సూర్యనారాయణ సింగ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఎస్.మల్లి మాట్లాడుతూ.. కావలిలో గవర్నమెంట్ వైద్యశాల ఆధ్వర్యంలో 20 దుకాణాలు ఉన్నాయని తెలి పారు. ఆ షాపులకు సంబంధించిన బకాయిలు వెంటనే వసూలు చేసి తీర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు భోజనాలు ఏర్పాటు చేసేందుకు ఒక దుకాణం ఏర్పాటు చేస్తే అందులో భోజనం చేసుకునేందుకు సహారే వంతంగా ఉంటుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా దుకా ణాల బకాయిలు వసూలు చేసి ఎస్సీ ఎస్టీ హాస్టల్స్ అభివృద్ధికి కృషి చేయా లని తెలిపారు. బకాయిలు ఇవ్వని వారిపై ప్రభుత్వ ప్రవహిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, కే. నరసింహులు జెడ్డా వాసు, లక్ష్మీనరసు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాల సాధనే శిరోధార్యం..

- పునరావాస కేంద్రాల అభివృద్ధికి యాక్షన్‌ప్లాన్
- ఎస్సీ డివిజన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రామచంద్రమూర్తి



**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాల సాధన, ఉన్నతాధికారులు దిశ నిర్దేశిత మార్గదర్శకాలను శిరోధార్యంగా భావిస్తూ తెలుగుగంగలో అంతర్భాగమైన ఎస్ఎస్ఎల్సీ. ఎస్సీ డివిజన్-1ను పురోగభివృద్ధితో ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు జి రామచంద్రమూర్తి తెలిపారు. సోమవారం ఎస్ఎస్ఎల్సీ, ఎస్సీ డివిజన్-1 పరిధిలోని కొ లపనాయుడు పలి, దాచూరు, నెర్నూరు, రామకూరు, గుండవోలు, రేగడిపల్లి, నెల్లేపల్లి తదితర ప్రాంతాల్లోని ఆర్అండ్ఆర్ సెంటర్ల (పునరావాస కెంద్రాలు)ను సందర్శించిన ఆయన ఆయా కేంద్రాల వారిగా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగమైన అంతర్గత సిమెంట్ రోడ్లు గుడి, బడి నిర్మాణాలు, తాగు నీరు, డ్రైనేజీ కాలువలు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి మౌళిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 1983లో కండలేరు రిజర్వాయర్ నిర్మాణ సమయంలో ముంపుకు గురై 27గ్రామీణ ప్రాంతాల ప్రజల ఎకర్యార్థం సకల సదుపాయాలతో పునరావాసం కల్పించే లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం తీసుకున్న సముచిత నిర్ణయం సుమారు 2000 మంది అర్హులైన అవార్డ్ దారులకు భరోసానిచ్చిందన్నారు. కండలేరు ప్రాజెక్ట్ పరీవాహక ప్రాంతాల్లో ముంపుకుగురైన 27గ్రామాలకు గానూ 23 ప్రాంతాలకు నివాసయోగ్యకరమైన మౌళిక వసతులతో కూడిన మోడల్ పునరావాస కేంద్రాల నిర్మాణం పనులు పూర్తిచేయడం జరిగిందని, మిగిలిన 4 సెంటర్ల (దాచూరు. గుండవోలు, రేగడిపల్లి, నెర్నూరు)లో కూడా ప్రభుత్వం నుంచి అనుమతులు అందిన వెంటనే యుద్ధప్రాతిపదికన పెండింగ్ పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం, ఉన్నతాధికారుల మార్గదర్శకాలు, సహోద్యోగుల సహకారం, అవార్డ్ దారులైన నిర్వాసితుల స్వచ్ఛంద భాగస్వామ్యాలతో అధునాతన సౌకర్యాలతో నిర్మితమైన ఆర్అండ్ఆర్ సెంటర్లను రాష్ట్రంలోనే రోల్‌మాడల్‌గా నిలిచేందుకు శక్తివంచలేకుండా కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట డిప్యూటీఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఉన్నారు.

## గురప్ప స్వామికి సోమవార ప్రత్యేక పూజలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు నడుమూరులో వేంచేసియున్న శ్రీ గురప్ప స్వామి అంకాలమ్మ తల్లి నాగవరపమ్మ అమ్మవార్లకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురవారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం కార్యక్రమాలు జరిపించారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. భక్తులు ఉదయాన్నే ఆలయానికి చేరి స్వామి వారి కార్యక్రమాలలో భాగస్వాములై తీర్థ ప్రసాదములు స్వీకరించి పునీతులయ్యారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

## రాజరాజేశ్వరి అమ్మవారి.. ప్రదోషకాలం పూజ



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు దుర్గామిట్టలోని శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు ఉప ఆలయమైన శ్రీ మీనాక్షి సమేత శ్రీ సుందరేశ్వర స్వామి వారి దేవస్థానం నందు త్రయోదశి సందర్భంగా సోమవారం సాయంత్రం ప్రదోషకాల పూజ శ్రీ సుందరేశ్వర స్వామి వారికి నందీశ్వరునికి అభిషేకం అత్యంత వైభవంగా జరిగినవి. ఈ కార్యక్రమాలన్నీ అర్చకులు వేద పండితులు ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణ అధికారి పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## పారిశుద్ధ్యం తాగునీటిపై దృష్టి సారించాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు పారిశుధ్యం మెరుగు తాగునీటి సమస్యలు తల్లత్తకుండా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. సోమవారం సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. సర్పంచ్లు కార్యదర్శులు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లు ప్రతి ఇంటికి వెళ్లి తడి పొడి చెత్తను సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించేలా చూడాలన్నారు. పారిశుద్ధ్యం తాగునీటి సమస్యల పట్ల ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పమన్నారు సచివాలయ ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదు సంవత్సరాలు పూర్తయిన ఉద్యోగులు బదిలీల కోసం తప్పనిసరిగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు సచివాలయ ఉద్యోగులు సొంత మండలాలు కాకుండా ఇతర మండలాలకు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హర్షణీయం

- రాష్ట్రప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు
- మగ్గం ఉన్నకార్మికుల తోపాటు..
- దారిద్ర్యరేఖకు దిగువనున్న చేనేతలందరికీ వర్తిం పేజేయాలి
- ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డ్ మాజీ డైరెక్టర్ కెఎస్ చక్రధారి



**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** కుల వృత్తినే జీవనాధారంగా ఎంచుకొని కుటుంబాలను పోషించుంటున్న చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరాను అందించేందుకు ఏపీ రాష్ట్రప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని ఆల్ఇండియా హ్యాండ్లూమ్ బోర్డ్ మాజీ డైరెక్టర్ కెఎస్ చక్రధారి సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలోని వివరాలిలా ఉన్నాయి. విద్యుత్ పరంగా చేనేతలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను పరిగణలోకి తీసుకున్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రకూటమి ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత కరెంట్ను ఇచ్చేందుకు ఈ ఏడాది మార్చి లోనే నిర్ణయం తీసుకోవడం తోపాటు కార్యాచరణ అమలుకు శ్రీకారం చుట్టడం సంతోషదాయకమని, ఇందుకు యావత్ చేనేత కుటుంబాల తరపున అప్పట్లోనే హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపామన్నారు. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 18 శాతం జనాభా కలిగిన చేనేతల్లో లక్షలాది మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారేనని, మగ్గం ఉన్న కార్మికుల తోపాటు చేనేత అనుబంధ వృత్తిదారులు, వస్త్రదుకాణాలు, హెూటల్స్, అపార్ట్మెంట్ల వద్ద వాచ్మెన్లు, ముఠాపనులు, తాపీ కూలీలుగా, మాస్టర్ వీవర్స్ వద్ద వస్త్రాలు తయారు చేసే పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న లక్షలాది మంది అసంఘటిత చేనేత నిరు పేద కుటుంబాల కార్మికులకు కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా పథకాన్ని వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే పలుజిల్లాల్లో అన్యాక్రాంతమవుతున్న చేనేతల ఆస్థులను కాపాడాలని, మగ్గం ఉన్న ప్రతి నేతకార్మికునికి ప్రభుత్వ రాయితీ పథకాలు వర్తింపజేయాలని, ఎంతో కళానైపుణ్యంతో చేనేతలు తయారు చేసిన వస్త్రాలకు ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించాలని విన్నవించారు.

# మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నెల్లూరు నగరపాలక సంస్థ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, 60 సంవత్సరాల నిండిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ బారాషాహీద్ దర్గా గ్రౌండ్స్ నుండి భారీ ర్యాలీ మున్సిపల్ కార్మికులు నిర్వ హించారు. అనంతరం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద నిరసన ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. తమ పట్ల కూటమి ప్రభుత్వం వివక్షపూరిత ధోరణి ప్రదర్శిస్తున్నదని, సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నెల్లూరు నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు,జిల్లా కార్యదర్శి కే. పెంచల నరసయ్య, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ బిలు మాట్లాడుతూ.. మునిసిపల్ కార్మికులు చాలీచాలని జీతాలతో, పస్తులతో, అప్పులతో జీవితాలు గడుపుతున్నారని అన్నారు. నిరంతరం చెత్తాచెదారాలు మలినాలు మలమూత్రాలు వద్ద పనిచేసే మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వ తీరు మారాలని అన్నారు. దళితులు గిరిజనులు బలహీనవర్గాల పట్ల కూటమి ప్రభుత్వ వివక్ష పూరిత ధోరణితో వ్యవహరించడం సరికాదని అన్నారు. బ్యాంకు రుణాలు కోరితే మీరు ఉద్యోగులు కాదని రోజువారి కూలీలని చెప్పిన పాలకులు, కార్మికులకు వర్తింపజేసే ప్రభుత్వ సంక్షేమ పథకాలు తీసివేయడానికి ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉద్యోగులుగా విడ్డూరంగా ఉందని అన్నారు. దళితులు గిరిజనులు బలహీన వర్గాలుగా ఉన్న మున్సిపల్ కార్మికుల పట్ల కూటమి ప్రభుత్వం వివక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తున్నదని అన్నారు. తక్షణమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు బేషరతుగా మున్సిపల్ కార్మికులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు నిండాయనే నెపంతో ఏ రకమైన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా, నోటీసులు కూడా ఇవ్వకుండా 93 మంది కార్మికులను అన్యాయంగా తొలగించారని అన్నారు. మంచినీటి సరఫరా వీధిలైట్లు తదితర పనులు నిర్వహించే ఇంజనీరింగ్ విభాగంలోని కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారని తక్షణమే వారి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో భవిష్యత్తులో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా శిబిరం వద్దకు విచ్చేసిన నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్‌కు నాయకులు, కార్మికులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొండా ప్రసాద్, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కామాక్షమ్మ, మట్టిపాటి శ్రీనివాసులు, సుజాతమ్మ, లోకేష్ భాగ్యమ్మ, మనోజ్, జైకుమార్, షబ్బీర్, రాంబాబు, పందల శ్రీనివాసులు,దార్ల మాలకొండయ్య, బాలు, కొండమ్మ, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అలఘునాధుని ఆలయ పుష్కరోత్సవమహాకుంభాభిషేకం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో అత్యంత ప్రాచీనచరిత్ర,ప్రాశస్త్యం కలిగిని శ్రీదేవి, భూదేవిసమేత శ్రీ అలఘునాధస్వామి ఆలయం పుష్కరోత్సవ మహాకుంభాభిషేకం ఘనంగా నిర్వహించేలా ఆలయ కమిటీ ప్రతినిధులు నిర్ణయించారు. వారు ఆలయం ప్రాంగణంలో సమావేశం నిర్వహించి ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. ఆలయ పునర్నిర్మాణం జరిగి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈసంవత్సరం ఆగస్టు 5నుండి 7వ తేదీ వరకు మహాకుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించాలని తీర్మానించారు. 7వ తేదీ మధ్యాహ్నం నూతన కళ్యాణ మండపంలో స్వామివారి కళ్యాణోత్సవం, అన్నప్రసాదవితరణం, సాయంత్రం 5గంటలకు గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 778 సంవత్సరాల క్రితం తెలుగు చోళరాజులుచే నిర్మించబడి శ్రీకృష్ణదేవరాయలచక్రవర్తిచే పూజలందుకున్న అందరివాడు అలఘ నాధుడుగా లక్షలాదిమందికి ఆశీస్సులం దజేశారన్నారు. ఈ ఆలయాన్ని పరిరక్షించు కోవడం కర్తవ్యంగా భావించి జీర్ణోద్ధరణగావిం చామన్నారు. ఆగస్టులో జరిగే బృహత్తర కార్యక్రమాలకు భక్తులు విరివిగా హాజరు కావాలని, స్వామి,అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. ఈకార్యక్రమాలకు అందరూ సంపూర్ణ సహకారమందించి విజయవంతం చేయాలని కూడా వారు కోరారు. ఈసమావేశంలో ఆలయకమిటీ ప్రతినిధులు, అర్చకులు పాల్గొన్నారు.

# మా బడి నుండి పిల్లలను తరలించవద్దు : అంకారావు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠ శాలను తర లించవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు పలుమార్లు ఆందోళన చేశారు. ఈసందర్భంగా స్కూల్ కమిటీ చైర్మన్ అంకారావు మాట్లాడారు. సైదాపురం మండలంలో మైనింగ్ ఉధృతంగా సాగుతున్న వైనంలో ట్రాన్స్‌ఫోర్ట్ ఎక్కువగా జరుగుతున్న తరుణంలో పిల్లల తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపించాలంటేనే భయాం దోళనకు గురవుతున్నారని స్కూల్ కమిటీ చైర్మన్ తెలిపారు. 500 నిర్వాసిత కుటుంబాలకు సంబం ధించి పిల్లల చదువు కోసం ప్రత్యేకంగా ఇక్కడ పాఠశాల ఏర్పాటు చేశారని తెలిపారు. అప్ప ట్నుంచి పిల్లలు ఇదే పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ వస్తున్నారని చెప్పారు. నేడు మోడల్ స్కూల్ పేరుతో ఈ పాఠశాల విద్యార్థులను ఒక కిలోమీటర్ నుండి ఆఫ్ కిలోమీటర్ వరకు తర లించేందుకు చర్యలు తీసుకోవడం తగదన్నారు. చిన్న పిల్లలు అంత దూరం వెళ్లడానికి ఇబ్బందు లు పడతారన్నారు. సైదాపురం మండలంలో మైనింగ్ ఉధృతంగా సాగుతున్నటువంటి అధికంగా ట్రాన్స్‌ఫోర్ట్ జరుగుతూ వాహనాలు అధిక సంఖ్యలో తిరగడం వలన పిల్లలు రాకపోకులకు రోడ్డు క్రాస్ దాటి వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. వర్షాకాలంలో చాలా ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సైదాపురంలోని ఎస్టీ కాలనీలో పాఠశాలను తరలించకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# జిల్లా కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలు ఆందోళన




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం జిల్లాలోని అంగనవాడీలు నెల్లూరు కలెక్టరేట్ ఎదుట ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలకు తల్లికి వందనం అమలు చేయాలని తెలియజేస్తూ అంగన్వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమకు కూడా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని కలెక్టరేట్ ఎదుట పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు నినాదాలు చేస్తూ హోరెత్తారు. యూనియన్ అధ్యక్షురాలు సుజాతమ్మ కార్యదర్శి షేక్ రెహనా బేగం ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సాధికార సర్వేలో అంగన్వాడీలకు ప్రభుత్వ ఉద్యోగాలని తొలగించాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం వెంటనే స్పందించి చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించి అంగన్వాడీలు జీవనం కొనసాగిస్తున్నారన్నారు. అంగన్వాడీలకు కూడా ప్రభుత్వ పథకాలు రేషన్ కార్డులు వర్తింపచేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ నిరసనలు మరింత తీవ్రతను చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్ఓ ఉదయభాస్కర్‌కు వినతిపత్రం అందించారు.

# స్వర్ణాంధ్రప్రదేశ్ సమావేశంలో వేమిరెడ్డి దంపతులు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో అమరావతిలో సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరిల సమక్షంలో జరిగిన సుపరిపాలన స్వర్ణాంధ్రప్రదేశ్ సమావేశంలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అలాగే రాబోయే కాలంలో చేపట్టాల్సిన అంశాలను వివరించారు. ఎంపీలకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు వివిధ అంశాలపై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో పాల్గొన్న వేమిరెడ్డి దంపతులు ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. పలు అంశాలను ఆయనతో చర్చించారు.

# పంటపాలెంలో పోలీస్ పికెట్ ఏర్పాటు




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పారిశ్రామిక ప్రాంతమైన పంటపాలెం గ్రామంలో రాజకీయ కక్షలు హత్యాయత్నాలకు దారి తీసినాయి. ఇనుము ఆయుధాలతో దాడి చేసే పరిస్థితి వచ్చింది. రెండు రోజుల క్రితం యదనపర్తి శ్యామ్ రెడ్డి పై స్థానికులైన లెనిన్ తో పాటు మరి కొందరు దాడి చేసినట్లు పోలీస్ శాఖ తెలిపింది. దీంతో ఈ గ్రామంలో అశాంతి వాతావరణం నెలకొన్నది. రాజకీయాలకు కేంద్ర బిందువు అయినటువంటి గ్రామంలో తొలిసారి ఈ సంఘటన జరిగింది. గాయపడిన శ్యామ్ రెడ్డి నెల్లూరు అపోలో హాస్పిటల్ నందు చికిత్స తీసుకుంటున్నారు. రాజకీయ కక్షలు కారణంతో అట్టుడికిన పంటపాలెం గ్రామంలో పోలీస్ శాఖ సోమవారం పోలీస్ పికెట్ ఏర్పాటు చేసింది. ఎక్కడ కూడా దాడులు జరగకుండా జాగ్రత్తలు చేపట్టింది. దాడి చేసిన వారిని పట్టుకుంటామని పోలీస్ శాఖ తెలిపింది. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీస్ అధికారులు తెలియజేశారు. శాంతిభద్రతలు పర్యవేక్షణ చేస్తున్నట్లు పోలీస్ అధికారులు పేర్కొన్నారు.

# సచివాలయ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** సచివాలయ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఎంపీడీవో కే.శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. నేషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని స్పష్టమైన జాబ్ చార్ట్ ఇవ్వాలని సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వర్తింపచేయాలని అర్హులైన సచివాలయ సిబ్బంది అందరికీ ప్రమోషన్లు ఇవ్వాలనిబీ గ్రామ వార్డు సచివాలయాలలో పనిచేస్తున్న వారికి సొంత మండలంలోని పనిచేసుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. సీనియారిటీ జాబితా విడుదల చేసి దాని ప్రాతిపదికన వెబ్ కౌన్సిలింగ్ ద్వారా పారదర్శకంగా బదిలీలు జరపాలన్నారు. హేతుబద్ధీకరణ మరియు మిగిలిపోయిన సిబ్బంది భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలన్నారు. సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని కోరారు.

# పాఠశాల విలీనం వద్దు.. మా బడి మాకు కావాలి



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** పాఠశాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ మండల కేంద్రమైన వరికుంటపాడు ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల వద్ద పాఠశాల విలీనం వద్దు మా బడి మాకు కావాలివద్దు అంటూ సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యా ర్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. పాఠశాలలు విలీనంతో చిన్నపిల్లలకు చదువు భారంగా మారుతుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. 3, 4, 5వ తరగతి పిల్లలు దూరంగా ఉన్న స్కూలుకు వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుందని వాపోయారు. ప్రస్తుతం ఉన్న పాఠశాలలోనే 3, 4, 5వ తరగతులు కొనసాగించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

# పొదలకూరు టీడీపీ మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

- మండల టీడీపీ అధ్యక్షుడుగా మస్తాన్ బాబు, కార్యదర్శిగా కృష్ణ యాదవ్
- పట్టణ అధ్యక్షుడిగా మల్లికార్జున్‌నాయుడు
- మండల తెలుగు యువత అధ్యక్షుడిగా రాజశేఖర్ రెడ్డి



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరు తెలుగుదేశం పార్టీ మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక బోగోలు కృష్ణారెడ్డి కళ్యాణ మండపంలో సోమవారం ఆ పార్టీ సర్వేపల్లి పరిశీలకులు దావా పెంచల రావు, సంస్థాగత ఎన్నికల పరిశీలకులు తూపిలి రాధాకృష్ణా రెడ్డిల అధ్యక్షతన పొదలకూరు మండల తెలుగు దేశం పార్టీ సంస్థాగత ఎన్నికలు జరిగాయి. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, ప్రధాన కార్యదర్శిగా పల్లారపు కృష్ణ యాదవ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడుగా బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షుడుగా వెన్నపూస రాజశేఖర్ రెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడుగా వెంపులూరు రామకృష్ణ గౌడ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడుగా కొంగి వెంకటరమణయ్య, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడుగా తాటి కృష్ణయ్య, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడుగా షేక్ ఖాదర్ బాషా, మండల తెలుగు రైతు అధ్యక్షుడుగా యత్తపు వెంకటరెడ్డి, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలుగా ఆదాల సుగుణమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు ప్రకటించారు. ఈ సందర్భంగా తిరిగి మండల పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన మస్తాన్ బాబు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో తిరిగి మూడవసారి మండల బాధ్యతలు అప్పగించిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తాను బాధ్యతయుతంగా పనిచేసి మండలంలో పార్టీ మరింత అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ కష్ట కాలంలో పనిచేసిన ప్రతి ఒక్కరిని గుర్తుపెట్టుకుని న్యాయం చేస్తామని చెప్పారు. గత వైసిపి పాలనలో ప్రభుత్వ అరాచకాలను మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొని పార్టీని ముందుకు నడిపించిన కమిటీనే తిరిగి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపికైన నూతన కమిటీకి మండల నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# భూకబ్జాలు నిలువరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం



## కృష్ణపట్నం గ్రామస్తులు హెచ్చరిక

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం గ్రామంలోని బంగాళాఖాతం వెంబడి ఏపీఐఐసీ భూముల్లో నెలకొన్న భూకబ్జాలను నిలువరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కృష్ణపట్నం గ్రామస్తులు హెచ్చరించారు. ఈ పోరాటానికి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సంఘీభావం తెలిపింది. సోమవారం కృష్ణపట్నం గ్రామస్తులు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రెవిన్యూ శాఖ ఉన్నతాధికారులను కలిశారు. ప్రభుత్వ భూమి అయినప్పటికీ తమ సాగు చేసుకుంటున్నామని కొంతమంది ఆక్రమించి ఆక్వా కల్చర్ చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెవిన్యూ శాఖ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. అధికారులు వారం రోజుల్లో సర్వే పూర్తిచేసి న్యాయం చేయాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన ధర్నా చేస్తామన్నారు. తదుపరి గ్రామస్తులు మీడియాతో మాట్లాడారు. త్వరలోనే ఈ సమస్యపై సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇస్తామన్నారు. పేదలకు న్యాయం చేస్తారన్న నమ్మకం ఉందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు నక్క రాధయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్‌కె ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు వరాల జల్లు




**కొండాపురం, మేజర్‌న్యూస్ :** మండలంలోని సత్యవోలు పంచాయితీ లోని లింగనపాలెం, సత్యవోలు, అగ్రహారంలోని ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు, విద్యా కిట్లు ఎస్ఆర్‌కె ఫౌండేషన్ తరపున గద్దె రామకృష్ణ అందచేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి రవికుమార్ మాట్లాడుతూ.. పంచాయితీలోని అన్ని గ్రామాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యోపకరణాలు అందిచడం అభినందనీయం అని గద్దె రామకృష్ణ సేవలను కొనియాడారు. నేటి యువతకు రామకృష్ణ స్ఫూర్తిదాయకం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మరో అతిథి కొమ్మి ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయులు మాల్యాద్రి మాట్లాడుతూ.. రామక్రిష్ణ అమెరికాలో ఉంటూ ఇక్కడ మూడు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల పిల్లకోసం నోటు పుస్తకాలు, విద్యాకిట్లు అందించడం గొప్ప విషయం అని విద్యార్థులందరు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రామకృష్ణ లాగా దాత్రుత్వం చేయాలనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇతర ఉపాధ్యాయులు దేగా మహేష్, చెంచురామయ్య, సునంద, రవిచంద్ర, బీమేశ్వరావు ట్రస్ట్ తరపున మందపల్లి మాధవరావు, వేణు, భాస్కర్, శ్రీనివాసులు, కోటేశ్వరరావు, రాఘవేంద్ర, వెంగలరావు, రమేష్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బదిలీల ప్రక్రియలో సేవలందించిన కాట్వానాయకులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ అసోసియేషన్ (కాట్వా) నాయకులు ఉపాధ్యాయులకు పలురకాలుగా సేవలందించారని కాట్వా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు పేర్కొన్నారు. నాయకులందరినీ ఆయన అభినందించారు. ఉపాధ్యాయులకు అవసరమైన సమాచారం అందించడం, ఆన్‌లైన్ సేవలు నేరుగాసేవలు అందించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా కాట్వా నాయకులు దోర్నాల రామ్మోహన్, కోట అనిల్‌కుమార్‌నాయుడు, దర్శివెంకటేవ్వర్లు, మొర్సెట్టి శివశంకర్, ఎంటిఎస్ ఉపాధ్యాయులు పార్లపల్లి వెంకటేశ్వర్లు, మొగిలిశెట్టి శ్రీనివాసులు, నలిశెట్టి శ్రీనివాసులు, నలిశెట్టిబేబీవిమల తదితరులకు అనుకూలమైన మండలాలకు బదిలీ జరిగిందన్నారు. ఉపాధ్యాయులకు సేవలందించిన కాట్వా నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలని కమతం సుబ్బారావు పేర్కొన్నారు.

## బెదిరింపులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో వ్యాపారస్తులకు కొందరు వ్యక్తులు చరవాణిలో మేము మున్సిపాలిటీ అధికారులు అంటూ రాణా చౌదరి అనే వ్యక్తి నుంచి ఫోన్ కాల్స్ వస్తున్నాయని ఫోన్ పే ద్వారా డబ్బులు వేయాలంటూ బెదిరిస్తున్నారని వారిపై తగిన చర్య తీసుకోవాలని సోమవారం ది కిరాణా మర్చంట్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు బాల్సా ప్రసాద్ ఆధ్వర్యంలో వ్యాపారస్తులు ఒకటో పట్టణ సీఐ ఫిరోజ్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం సీఐ ఫిరోజ్ మాట్లాడుతూ.. వ్యాపారస్తులకు అండగా మేము ఉంటామని బెదిరింపు కాల్స్ విషయములో వాటి నెంబర్లను లిఖితపూర్వకంగా రాసి ఇస్తే చర్యలు తీసుకుంటామని ఇటువంటి సైబర్ నేరాలకు పాల్పడే వారిని కఠినంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం కిరణా మచ్చుని అసోసియేషన్ బాల్సా ప్రసాద్ మాట్లాడుతూ.. సీఐ ఫిరోజ్ సానుకూలంగా స్పందించి మాకు భరోసా కల్పించినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిరాణం మర్చంట్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో బైక్ మెకానిక్ మృతి

**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు మండలం పెనుబర్తి జాతీయ రహదారిపై ప్రమాదం చోటుచేసుకుంది.. ఈ ప్రమాదంలో రాపూరు పట్టణానికి చెందిన నగిరి వేణు (48) ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వేణు రాపూరులో బైకు మెకానిక్ షాపు నడుపుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 26 నుంచి ఉచిత నట్టల నివారణ కార్యక్రమం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని గండిపాలెం పశు వైద్యశాల పరిధిలోని గ్రామాలలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 26 నుండి జూలై 7వ తేదీ వరకు ఉచిత నటల నివారణ కార్యక్రమం జరుగుతుందని పశు వైద్యాధికారి రాఘవేంద్ర శర్మ సోమవారం ఒక ప్రకటనలు తెలిపారు. వైద్యశాల పరిధిలోని మేకలు గొర్రెలు, 35వేలు ఉన్నాయని జీవాల పోషకులు తమ గేవాలకు నట్టల నివారణ మందు పశువైద్య సిబ్బందిని కలిసి తాపించాలన్నారు. ఈ అవకాశాన్ని జీవాల పోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# చట్టపరంగా విచారణ జరిపి న్యాయం చేయండి : ఏఎస్పీ సిహెచ్ సౌజన్య



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు పిజిఆర్ఎస్ కార్యక్రమం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల ద్వారా 94 ఫిర్యాదులు అందాయి. అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించి, ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి చట్టపరంగా విచారణ జరిపి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో టౌన్ డీఎస్పీ సింధుప్రియ, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ చెంచు రామారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, ఎస్బి-2 సీఐ శ్రీనివాసరెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు. వేదాయపాలెం పరిధికి చెందినటువంటి రెండు కుటుంబ సభ్యులను, నెల్లూరు టౌన్ కి చెందిన పద్మయ్య, కిరణ్ కుమార్ అనే పరిచయస్థుల ద్వారా తిరుచ్చికి చెందిన సాలా ఉద్దీన్, నెల్లూరుకి చెందిన శివకుమార్ అనే ఏజెంట్లు ద్వారా, నెల్లూరులోని బ్యాంకులలో ఉన్న మీ నగలను విడిపించి, తిరుచ్చిలోని కేజీజి ఇన్వెస్ట్మెంట్ అనే సంస్థలో పెట్టి, ఎటువంటి వడ్డీ లేకుండా, మీ అసలు నగదు తెచ్చిన వెంటనే మీ నగలను ఇస్తామని నమ్మించి, ఒకరి వద్ద 30 సవర్లు, మరొకరు వద్ద 35 సవరలు తీసుకొని, ప్రస్తుతం నగదు కడతామని చెప్పినా నగలు తిరిగి ఇవ్వడం లేదని, మోసపోయామని, విచారించి న్యాయం చేయాలని కోరారు. ఉలవపాడు పరిధికి చెందినటువంటి మహిళను అదే ప్రాంతానికి చెందిన శశి అనే వ్యక్తి తనకు తెలియకుండా ఇన్స్టాగ్రామ్‌లో రెండు ఐడీలను క్రియేట్ చేసినట్లు, తనను పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్నాడని, తన గురించి తన బంధువులకు అసభ్యకరమైన మెసేజ్‌లు పెడుతున్నట్లు, కళాశాల, ఊర్లో అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు. దుత్తలూరు పరిధికి చెందిన మహిళ కుమార్తెను, అదే ప్రాంతానికి చెందిన చింటూ, సుదీర్, జయకృష్ణ అనే వ్యక్తులు తన కుమార్తె పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు మరియు ఈ నెల 20వ తేదీన మధ్యాహ్నం మాకు తెలియకుండా తన ఫోటోలు తీసినట్లు విచారించి న్యాయం చేయాలని కోరారు. నెల్లూరు రూరల్ పరిధికి చెందిన మహిళను అదే ప్రాంతానికి చెందిన ముత్యాల శివ అనే వ్యక్తి తన శారీరకవాంఛ తీర్చమని మానసికంగా వేధిస్తున్నాడని లేదంటే సోషల్ మీడియాలో తన గురించి అసభ్యంగా పెడతానని బెదిరిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు. బుచ్చి పరిధికి చెందినటువంటి వ్యక్తి, తన భార్య జనవరి నుండి కనిపించడం లేదని, బుచ్చి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు, ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు. వివి పాలెం పరిధికి చెందిన మహిళను తన భర్త, మామ చెడు అలవాటుకు లోనై తనని, తన పిల్లల్ని పట్టించుకోకుండా వేధిస్తున్నారని, ఇంటి నుండి గెంటివేయాలని ప్రయత్నిస్తున్నారని అదేవిధంగా కావలి 2 టౌన్ పరిధికి చెందిన మహిళను తన భర్త, అతని స్నేహితుడు అరవింద్ మా కుటుంబ విషయాల్లో జోక్యం చేసుకొని ఇరువురు కలిసి నన్ను నా పిల్లల్ని వేధిస్తున్నారని విచారించి న్యాయం చేయాలని, కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు. వేదాయపాలెం పరిధికి చెందినటువంటి వ్యక్తిని, 14.06.25 న ఒక ఆటో గుద్దగా గాయాల పాలైనట్లు, ఆ ప్రమాదంపై తనకి అనుమానంగా ఉందని, పూర్తిగా విచారించి న్యాయం చేయాలని కోరారు.

సూర్య నేటి దినపత్రిక

విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, అనంతసాగరం, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా,
కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు
9000118811, 9000483583

# వైభవంగా రామలింగేశ్వరుని రథోత్సవం

- స్వామివారి రథం లాగేందుకు పోటీపడ్డ భక్తులు
- మొక్కులు తీర్చుకున్న భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- మజ్జిగ మంచి నీరును అందించిన దాతలు





**విడవలూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని రామతీర్థంలో వెలసిన శ్రీ కామాక్షి సమేత శ్రీ రామలింగేశ్వర ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విశేష పూల అలంకరణతో ముస్తాబు చేసి స్వామి అమ్మవాలను అందులో కొలువుంచారు. అనంతరం భక్తులు రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. స్వామివారి కొలువైన రథాన్ని రామతీర్థం పాతూరు గ్రామాల మీదగా సాగింది. ఈ సందర్భంగా స్వామివారిని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనటంతోపాటు టెంకాయలు, గుమ్మడికాయలు కొట్టి ఉప్పును రథంపై చల్లి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని మనసారా తిలకించి పునీతులవ్వాలని వృద్ధులు వికలాంగులు రథం వద్దకు చేరుకున్నారు. రథం సాగే ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను స్థానికులను ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బందు లేకుండా దాతలు మజ్జిగ మంచి నీరు అందించారు. ఈ కార్యక్రమానికి శంభుని కాపులు ఉభయ కర్తగా వ్యవహరించగా దేవాదాయ శాఖ అధికారులు అర్చకులు పాల్గొన్నారు.

## మూలస్థానేశ్వరునికి ప్రదోషకాలాభిషేకం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ములాపేటలో వేంచేసియున్న శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం త్రయోదశి పర్వదినం పురస్కరించుకొని ఆలయంలో శ్రీ మూలస్థానేశ్వర స్వామికి, స్వామికి అభిముఖంగా ఉన్న నందిస్వరునికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. ఈ వేడుకను చూడడానికి భక్తులు విశేషముగా తరలి వచ్చారు. అనంతరం రాత్రి నంది మీద స్వామి అమ్మవార్ల పల్లకి సేవ జరిపారు.

## డ్రైను కాలువల పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టండి : కమిషనర్ వైఓ నందన్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో జరుగుతున్న డ్రైన్ కాలువల పూడికతీత పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, సిల్ట్ ఎత్తివేత క్రమం తప్పకుండా చేపట్టాలని శానిటేషన్ విభాగం సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక ఆచారి వీధి, కలెక్టరేట్, కర్ణాల మిట్ట, ములుముడి బస్టాండ్ పరిసర ప్రాంతాలలో జరుగుతున్న డ్రైన్ కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను కమిషనర్ సోమవారం పర్యవేక్షించారు. అన్ని డివిజన్లలో అనుమతుల ప్రకారమే భవన నిర్మాణాలు జరిగేలా టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్ ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ శానిటేషన్ విభాగం, ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రికెట్ క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే



**కావలి, మేజర్‌న్యూస్ :** కేసిఏ క్రికెట్ టీం ఆధ్వర్యంలో అండర్ 19 విభాగానికి నెల్లూరు జిల్లా క్రికెట్ జట్టు నుండి కావలి కేసిఏ జట్టు నుండి 5 మంది క్రీడాకారులు భార్గవ్, లోకేష్ ఎంపికయ్యారు. అలాగే అండర్ 16 విభాగానికి రిషిత్, నవీంద్ర, యశ్వంత్ ఎన్నికైనారు కాలనీ కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి వారి గృహంలో కారుని అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, భవిష్యత్తులో క్రికెట్లో బాగా రాణించి రాష్ట్రస్థాయిలో కావలికి మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. కావలి క్రికెట్ అసోసియేషన్ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు సిద్దు క్రికెట్ కోచ్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐగా ఎన్.ప్రభాకర్ బాధ్యతలు



**బిట్రగుంట, మేజర్ న్యూస్ :** బిట్రగుంట పోలీసు స్టేషన సబ్ ఇన్సపెక్టర్‌గా ఎన్.ప్రభాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ కే.బోజ్య నాయక్ వీఆర్‌కు బదిలీపై వెళ్ళారు.